సాక్షి
మెదక్
శుక్రవారం । 26 । జూలై । 2024



మృత్యువులోనూ వీడని బంధం
రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలంలో చోటు చేసుకుంది.
వివరాలు IIలో ▸



తండాల్లో తాగునీటి తిప్పలు
వర్షాకాలంలోనూ తాగునీటి కోసం గిరిజనులు సతమతం అవుతున్నారు. రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.
వివరాలు IIIలో ▸

నేడు నీటి సరఫరా బంద్
మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో శుక్రవారం మిషన్ భగీరథ నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ జానకీరాంసాగర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగూరు వద్ద మోటార్లు చెడిపోయినందున మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఎన్‌డీఎస్‌ఎల్ రీ ఓపెన్

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులు ఆశాజనకంగా ఉన్నాయి. తొమ్మిదేళ్ల క్రితం అకారణంగా మూతపడిన ఎన్‌డీఎస్‌ఎల్ ఫ్యాక్టరీని రీ ఓపెన్ చేస్తామని గురువారం అసెంబ్లీలో ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అలాగే మెడికల్ కళాశాలకు బోధన, బోధనేతర సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారు. జిల్లా మీదుగా వెళ్లే ఆర్‌ఆర్‌ఆర్‌కు నిధులను విడుదల చేస్తామన్నారు. వీటితో పాటు వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. -మెదక్‌జోన్

బడ్జెట్‌లో మెతుకుసీమకు ప్రాధాన్యం | **కేటాయింపులపై భిన్నాభిప్రాయాలు**

2015లో ఫ్యాక్టరీ మూసివేత

నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ (ఎన్‌డీఎస్ఎల్)ని గోకరాజు, గంగారాజు 2015లో అకారణంగా మూసివేశారు. ఫ్యాక్టరీని నడిపేందుకు నీటి సౌకర్యం లేదని, దాని పరిధిలో చెరుకు సాగు లేదనే సాకు చూపి రాత్రికి రాత్రే లే ఆఫ్ ప్రకటించారు. దీంతో ఫ్యాక్టరీ పరిధిలోని 14 మండలాల పరిధిలో సాగు చేసిన లక్షలాది టన్నుల చెరుకును ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే తాము అధికారంలోకి రాగానే 100 రోజుల్లో తెరిపిస్తామంటూ బీఆర్ఎస్ నాయకులు అప్పట్లో హామీ ఇచ్చారు. 10 ఏళ్లు అధికారంలో ఉన్నా ఫ్యాక్టరీని తెరిపించలేకపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీ యాజమాన్యం దానిపై చేసిన అప్పును కొంత బ్యాంకులో జమ చేయడం, బడ్జెట్‌లో తెరిపిస్తామని చెప్పడంతో రైతులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెడికల్ కళాశాలకు సిబ్బంది

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలకు బోధన, బోధనేతర సిబ్బందిని కేటాయిస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. దాని నిర్మాణానికి రూ.180 కోట్లు విడుదల చేస్తున్నట్లు జీఓ విడుదల చేసినా నిధులు మాత్రం విడుదల కాలేదు. కాగా ఇటీవల కళాశాల నిర్వహణకు సిబ్బంది లేరనే సాకుతో కేంద్రం అనుమతి నిరాకరించిన విషయం విదితమే. కాగా బడ్జెట్ ప్రసంగంలో మంత్రి భట్టి విక్రమార్క రాష్ట్రంలోని కొత్త మెడికల్ కళాశాలల నిర్వహణకు బోధన, బోధనేతర సిబ్బందిని నియమిస్తామని చెప్పడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రీజినల్ రింగు రోడ్డుకు నిధులు

రీజినల్ రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) జిల్లాలోని తూప్రాన్, నర్సాపూర్, శివ్వంపేట మండలాల మీదుగా వెళ్తుంది. దీని పరిధిలో సుమారు 800 ఎకరాల పైచిలుకు రైతులు భూములు కోల్పోతున్నారు. కాగా బాధిత రైతులు తమకు భూమికి భూమి ఇవ్వాలి లేదా, ఎకరాకు రూ.60 నుంచి రూ.70 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బడ్జెట్ కేటాయింపులో ట్రిపుల్‌ఆర్‌కు రూ. 1,525 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో భూసేకరణ చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యే అవకాశం ఉంది.

వ్యవసాయానికి పెద్దపీట

బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేయడంతో జిల్లాకు లబ్ధి చేకూరనుంది. జిల్లాలో 5 లక్షల పైచిలుకు ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, అందులో 3.94 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. 1.93 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరు వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ. 8 వందల కోట్లు అప్పు తీసుకున్నారు. ఇందులో మొదటి విడత రుణమాఫీలో రూ.లక్ష లోపు 47,616 మంది రైతులకు రూ. 237.5 కోట్లు మాఫీ అయింది. ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్ పాం సాగుకు ఇప్పటికే జిల్లాలో ఐదు వందల ఎకరాల పైచిలుకు సాగవుతోంది. అలాగే సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామనడంతో ఈ ఏడాది జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సన్నవరిని సాగు చేశారు. అలాగే ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నామని, ఇందుకు సంబంధించిన బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని బడ్జెట్ కేటాయింపుల్లో చెప్పడంతో లక్షలాది రైతులకు లబ్ధి చేకూరనుంది. అలాగే ఇరిగేషన్ కోసం బడ్జెట్‌లో రూ. 22,305 కోట్లు కేటాయించారు. జిల్లాలో అనేక నీటి వనరులకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించడంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు కానున్నాయి.



నియోజకవర్గానికి 3,500 ఇళ్లు

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తామని, ఇప్పటివరకు అర్ధాంతరంగా ఆగిన ఇళ్లను సైతం పూర్తిచేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మెదక్, నర్సాపూర్‌కు రూ.7 వేల ఇళ్లు మంజూరు కానున్నాయి. జిల్లాలో 7,48,425 మంది జనాభా ఉండగా 1,95,297 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరికి మహాలక్ష్మి పథకంలో రూ. 500కు సిలిండర్ సరఫరా చేస్తున్నారు. అలాగే గృహలక్ష్మి పథకంలో భాగంగా జిల్లాలో 1,20,193 ఇళ్లకు గానూ ఇప్పటి వరకు రూ. 363 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. అలాగే రైతు భరోసాను త్వరలోనే అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇప్పటికే కొనసాగుతోంది. ఇవేకాకుండా తండాలకు బీటీ రోడ్లు వేయడంతో పాటు గిరిజన పంచాయతీ భవనాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించి వసతులు కల్పిస్తామని చెప్పారు. జిల్లాలో నూతనంగా 63 గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చారు.

విద్యను విస్మరించారు



వార్షిక బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. విద్యా వ్యవస్థకు కేవలం 7.31 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. విద్యాశాఖకు నిధుల కేటాయింపులో గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి పెద్దగా తేడా లేదు.
– ఎల్లం, తపస్ జిల్లా అధ్యక్షుడు

కేటాయింపులేవి..?



బడ్జెట్‌లో ఎన్‌డీఎస్ఎల్‌ను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు, కానీ కేటాయింపులు లేకపోవడం నిరాశకు గురిచేస్తోంది. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా వెంటనే కేటాయింపులు చేసి ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి.
– కొండల్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ మెదక్

చేతల్లో చూపించాలి



ఎన్‌డీఎస్ఎల్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని బడ్జెట్‌లో పేర్కొనడం శుభపరిణామం. ఫ్యాక్టరీ మూతతో కార్మికులు రైతులు జీవనోపాధి కోల్పోయారు. అయితే ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించాలి.
– శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అరచేతిలో స్వర్గం చూపారు



నర్సాపూర్: బడ్జెట్ అరచేతిలో స్వర్గం చూపినట్లుగా ఉంది. ఆరు గ్యారంటీల అమలుకు నిధులు లేవు. మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వృద్ధులను విస్మరించారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలను తాము చేశామని చెప్పుకున్నారు.
– సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

హామీలకు అభయహస్తం



నర్సాపూర్: బడ్జెట్ ఆరు గ్యారంటీలకు అభయహస్తంగా ఉంది. అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. రైతును రాజును చేసే విధంగా కేటాయింపులు ఉన్నాయి. అభివృద్ధి, సంక్షేమానికి సమభాగంలో నిధులు కేటాయించారు.
– ఆంజనేయులుగౌడ్, డీసీసీ అధ్యక్షుడు

న్యూస్‌రీల్

మోసకారి ప్రభుత్వం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ శ్రేణులు

మెదక్‌జోన్: రాష్ట్ర ప్రభుత్వం మోసకారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ విమర్శించారు. గురువారం పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఎన్‌డీఎస్‌ఎల్, ఏడుపాయల ఆలయ అభివృద్ధికి నిధుల కేటాయింపులు లేవని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నాయిని ప్రసాద్, బక్కన్న శివ, తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రమాదాల నివారణకు చర్యలు: ఆర్డీఓ



మంజీర నది ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయలలో నీటి ప్రమాదాల బారినపడి మరణాలు సంభవించకుండా తక్షణ చర్యలు తీసుకోవడానికి ప్రతిపాదనలు పంపాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం ఏడుపాయల మంజీరా నది తీరంలో ప్రమాదాలు జరిగే స్థలాన్ని తహసీల్దార్ లక్ష్మణ్‌బాబుతో కలిసి పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ఘనపూర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, భద్రత చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టు పైకి ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమస్యలుంటే తెలపండి: డీఏఓ



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ గోవింద్

శివ్వంపేట(నర్సాపూర్): రుణమాఫీపై సమస్యలుంటే రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేయాలని డీఏఓ గోవింద్ సూచించారు. గురువారం మండలంలోని గోమారంలో పంటలను పరిశీలించారు. అనంతరం ఏపీజీవీబీలో తొలివిడత రైతులకు వచ్చిన రుణమాఫీపై బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు రుణమాఫీ డబ్బులు పంట పెట్టుబడి కోసం ఉపయోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓలు మజీద్‌అలీ, రవి, భవాని, మౌనిక రైతులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ తీరును ప్రజల్లో ఎండగడతాం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరును ప్రజల్లో ఎండగడతామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ కృషి వల్ల తెలంగాణ దేశంలోనే అగ్రస్థానం వైపు పరుగులు తీస్తే నేడు భిన్నమైన పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. ఏడు నెలల పాలనలో కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల తీరును కూడా సక్రమంగా లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయకపోతే కాంగ్రెస్‌కు ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదన్నారు. మరోవైపు బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చి తెలంగాణ ప్రజలను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీని ఎనిమిది ఎంపీ స్థానాల్లో గెలిపించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ కేంద్రం సహకరించపోయినా ఎన్నో భారీ అభివృద్ధి ప్రాజెక్టులను పూర్తి చేసి చూపారని గుర్తు చేశారు.

మిద్దె తోటల పెంపకం భేష్..

సిద్దిపేటజోన్: మిద్దె తోటల పెంపకం భేష్ అని, మరింత ప్రోత్సహిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి అన్నారు. గురువారం పట్టణంలో పలువురు తమ ఇంటి మిద్దెలపై పెంచుతున్న పూల, కూరగాయల మొక్కలు పరిశీలించారు. కొత్త సంప్రదాయం బాగుంటుందన్నారు. అనువైన స్థలం లేని వారు మిద్దె తోటల పెంపకం చేపట్టాలని సూచించారు.

మీసేవలో డిజిటల్ చెల్లింపులు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పాపన్నపేట(మెదక్)/టేక్మాల్: మీ సేవలో డిజిటల్ చెల్లింపులు చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం పాపన్నపేట, టేక్మాల్ మండలంలోని మీ సేవ కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఈఎస్‌డీ నూతనంగా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ పేమెంట్ విధానాన్ని పరిశీలించారు. ప్రజలందరూ క్యాష్‌లెస్ డిజిటల్ పేమెంట్ చేయాలని సూచించారు. దీనివల్ల ప్రజలు ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా ఉపయోగపడుతుందని అన్నారు. మీసేవ నిర్వాహకులు ఈఎస్‌డీ ఆదేశాల మేరకు రెవెన్యూ సర్వీసులకు సంబంధించి సరైన పత్రాలు మాత్రమే జతపరచాలని సూచించారు. ఈఎస్‌డీ సూచనల ప్రకారం నడుచుకోవాలన్నారు. ప్రజల దగ్గర ఎలాంటి అదనపు రుసుము తీసుకోవద్దని ఆదేశించారు. అనంతరం టేక్మాల్ తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న ధరణి, కల్యాణలక్ష్మి, మీ సేవకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను సమీక్షించారు. ప్రజాపాలన కేంద్రంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటవెంటనే దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ సందీప్, మీసేవ జిల్లా మేనేజర్ శశికాంత్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేట మీ సేవ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



రంగంపేట తురకల చెరువుకు జలకళ



వీడని ముసురు

కొల్చారం(నర్సాపూర్): రెండు రోజులుగా ముసురు వీడడం లేదు. గ్రామాల్లో మట్టి రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. దీంతో అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొంది. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో ముసురుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మరో రెండు రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే పత్తి పంట దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎడతెరపి లేని వర్షంతో చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి.

24 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించాలి



ఎనర్జీ మీటర్‌ను పరిశీలిస్తున్న రొనాల్డ్‌రోస్

సాక్షిప్రతినిధి,సంగారెడ్డి : పాడైపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పట్టణాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో పునరుద్ధరించాలని రాష్ట్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫారుఖీతో కలిసి ఆయన గురువారం సంగారెడ్డిలోని విద్యుత్‌శాఖ స్టోర్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రొనాల్డ్‌రోస్ మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ఉద్యోగులు, సిబ్బంది కృతనిశ్చయంతో పనిచేయాలని ఆదేశించారు. 11 కేవీ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను ఎప్పటికప్పుడు నిశితంగా పర్యవేక్షించాలని, ఫీడర్ వైజ్ నోడల్ అధికారులను నియమించాలన్నారు. స్టోర్స్‌లో స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎనర్జీ మీటర్లు, పోల్స్, కండక్టర్లు, రోలింగ్ స్టాక్ అవసరం మేరకు ఉంచుకోవాలన్నారు.

శాంతి భద్రతలు పటిష్టం

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్/చిలప్‌చెడ్/కౌడిపల్లి: శాంతి భద్రతలు పటిష్టంగా అమలు చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల విచారణలో ఎలాంటి జాప్యం చేయొద్దని, వీలైనంత త్వరగా విచారణ పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. వివక్ష చూపొద్దని హితవు పలికారు. 100కు వచ్చే ఫోన్‌కాల్స్‌కు త్వరితగతిన స్పందించాలన్నారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, సర్కిల్‌లోని ఎస్‌ఐలు పుష్పరాజ్, రంజిత్‌కుమార్, షేక్ మహబూబ్ పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. సర్కిల్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి ఆయా ఎస్‌ఐలకు సూచనలు చేశారు.



కౌడిపల్లి: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మహిళల రక్షణ అందరి బాధ్యత

సీనియర్ జడ్జి రమేశ్

జోగిపేట(అందోల్): అందరికీ సమ న్యాయం జరగాలని చట్టం సూచిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి రమేశ్ అన్నారు. గురువారం జోగిపేట డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లల రక్షణ చట్టం, బాల్య వివాహ నిషేధం, గృహహిం సన, వరకట్న నిషేధం, మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక తదితర చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. మహిళల రక్షణను ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. అడిషనల్ ఎస్పీ సంజీవ్ రావు మాట్లాడుతూ బాలికలను లైంగిక వేధింపుల నుంచి కాపాడేందుకు పోక్సో చట్టం పనిచేస్తుందని తెలిపారు. అలాగే షీ టీమ్స్, భరోసా, సఖి, ఉమెన్స్ వింగ్ కూడా పనిచేస్తున్నాయని చెప్పారు. మత్తుకు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, పల్లవి పాల్గొన్నారు.

డెంగీ నివారణకు ముందస్తు చర్యలు

కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట(మెదక్): డెంగీ నివారణకు జిల్లావ్యాప్తంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గురువారం మండలంలోని సుతారిపల్లిలో డీఎంహెచ్‌ఓ శ్రీరాంతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగీ పేరిట రోగులను ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో వంద మంది నుంచి రక్తం శాంపిల్స్ సేకరించామన్నారు. అలాగే తాగు నీరు టెస్టింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎవరికీ మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లేదని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామంలో కొనసాగుతున్న ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. ప్రజలు పరిశుభ్రత పాటించాలని, నీటిని నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

రుణమాఫీపై ఆరా..

రామాయంపేటలోని ఏపీజీవీబీని కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి రుణమాఫీ ప్రక్రియను పరిశీలించారు. బ్యాంకు పరిధిలో ఎంత మందికి రుణమాఫీ జరిగింది, ఎంతమంది రెన్యూవల్ చేసుకున్నారని బ్యాంకు మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని సూచించారు. రుణమాఫీకి సంబంధించి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి కృషి చేయాలని మండల వ్యవసాయ అధికారిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో జిల్లాలో నిలిచిపోయిన 362 మంది రైతులకు సంబంధించి రూ. కోటి మూడు లక్షలు జమ కావాల్సి ఉందన్నారు. రుణమాఫీ విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నందుకు గాను మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, బ్యాంకు మేనేజర్ నందకిషోర్‌ను కలెక్టర్ సన్మానించారు.



సుతారిపల్లి: కుండిలో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

విద్యుత్ సమస్యలు రానియొద్దు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకూడదని, అంటు వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యుత్ సమస్యలు, అంతరాయం లేకుండా చూడాలన్నారు. సరఫరాలో ఏదైనా సమస్యలుంటే త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలను ఆరోగ్య విషయంలో చైతన్యవంతం చేయాలని సూచించారు. గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికరమైన ఆహారం అందించాలన్నారు. అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేసి విద్యార్థులు, గర్భిణులకు పౌష్టికరమైన ఆహారం అందించాలని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

కేటాయిస్తే సరిపోదు

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



సిద్దిపేటఅర్బన్‌: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం కాగితాల మీద లెక్కలకే పరిమితం కాకుండా ప్రజల సంక్షేమానికి ఖర్చు చేసి అభివృద్ధికి పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ అంకెల గారడీగా మారకుండా గత ప్రభుత్వాల మాదిరిగా కేటాయింపులు చేసి ప్రజా సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతర పథకాలకు మళ్లించి ప్రజలపై భారాలు వేయొద్దన్నారు. పేదలకు ఇళ్లు, స్థలాలు, రేషన్ కార్డుల జారీ, విద్యా, వైద్యం, రవాణా రంగాలకు ఖర్చు చేసి నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు.

హామీల అమలు కోసం..

సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వ్యవసాయ రంగానికి, రైతులకు మేలు చేసే విధంగా ఉండడం హర్షణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ఈన్నారు. బడ్జెట్‌పై గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం బడ్జెట్‌లో వివిధ రంగాలకు నిధులు కేటాయించడం శుభసూచకమన్నారు. భూమి లేని వారికి ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సహాయం చేయడం సంతోషకరమని, గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిందన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి తక్కువ నిధులు కేటాయించడం బాధాకరమన్నారు.

దళితులను విస్మరించారు

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర బడ్జెట్‌లో దళితుల అభ్యున్నతిని పూర్తిగా విస్మరించిందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ విమర్శించారు. గురువారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీల జనాభా ప్రకారం రాష్ట్ర బడ్జెట్‌లో 18 శాతం నిధులు రూ. 52,409 వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా కేవలం రూ. 33,124 కోట్లు కేటాయించారని మండిపడ్డారు. రాష్ట్ర బడ్జెట్ రూ. 2,91,159 కోట్లు కాగా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక నిధి కేటాయింపుల చట్టం ప్రకారం 18 శాతం నిధులు కేటాయించకుండా కేవలం 11 శాతం నిధులు కేటాయించి చట్టాన్ని ఉల్లంఘించిందారన్నారు. బడ్జెట్‌ను సవరించి ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన పథకాలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

విద్యా రంగానికి అన్యాయం

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మధు



బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించి అన్యాయం చేశారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సంగెం మధు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఫీజు రియింబర్స్‌మెంట్, మెస్‌చార్జీలపైన స్పష్టత లేదని పేర్కొన్నారు. యూనివర్సిటీల అభివృద్ధికి, ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు నిధుల కేటాయింపులు లేవని ఆరోపించారు. విద్యారంగానికి నిధులు పెంచి ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.


విద్యార్థులతో అసభ్యకర ప్రవర్తన

కరాటే మాస్టర్‌పై ఎంఈఓకు ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్‌: ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇచ్చే కరాటే మాస్టర్ విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ముత్తంగి గ్రామస్తులు గురువారం పటాన్‌చెరులోని ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ముత్తంగి ప్రభుత్వ పాఠశాలలో కరాటే మాస్టర్ కుమార్ విద్యార్థులతో అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని, అదే విధంగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రుణమాఫీ డబ్బులు జమ చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్



సిబ్బందికి సూచనలు చేస్తున్న మహేశ్

తొగుట(దుబ్బాక): రుణమాఫీ పొందిన రైతులకు డబ్బులను ఖాతాల్లో జమ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి మహేశ్ బ్యాంకు సిబ్బందికి సూచించారు. మండల కేంద్రమైన తొగుటలోని గ్రామీణ వికాస్ బ్యాంకును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రుణమాఫీ పొందిన రైతులు బ్యాంకు వారికి తగిన డాక్యుమెంట్లు అందజేసి రుణమాఫీ డబ్బులను పొందాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, వ్యవసాయ అధికారి మోహన్, బ్యాంకు మేనేజర్ జలంధర్ పాల్గొన్నారు.

చేపట్టకపోతే ఎట్లా?

- శనిగరంలో నిరుపయోగంగా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం
- వసతులు లేక ఇతర ప్రాంతాల నుంచి తెస్తున్న అధికారులు
- సీడ్ రేరింగ్ చేసి తరలిస్తున్న వైనం
- గతంలో మధ్య తరహా ప్రాజెక్ట్ ఆధారంగా నిర్వహణ
- ఆందోళనలో జిల్లాలోని మత్స్యకారులు

ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న శనిగరం ప్రభుత్వ మత్స్య విత్తన ఉత్పత్తి కేంద్రం అలానా పాలనాకు నోచుకోవడం లేదు. పాలకుల, అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఉత్పత్తి కేంద్రం నిరుపయోగంగా మారింది. పాత కరీంనగర్ జిల్లాలో ఉన్నప్పుడు ఈ ఉత్పత్తి కేంద్రం ద్వారా చేప పిల్లలను సప్లయ్ చేసేవారు. సిద్దిపేట జిల్లాలో ఈ ప్రాంతాన్ని కలిపిన తర్వాత చేపలు ఉత్పత్తి చేయడం లేదు. గతంలో శనిగరం మధ్యతరహా ప్రాజెక్ట్ నీటిని వినియోగించి చేపల ఉత్పత్తితో మత్స్యకారులకు ఉపాధి కల్పించేవారు. కానీ నేడు పట్టించుకునే వారు లేక, సరిపడా వసతులు కరువై కేంద్రం నిరుపయోగంగా మారింది.

– కోహెడరూరల్(హుస్నాబాద్)

ఏడు మండలాలు కలుపుకొని కొన్నేళ్ల కిందట శనిగరం గ్రామంలో డివిజన్ చేపల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మధ్య తరహా ప్రాజెక్ట్ కాల్వ నీరు ద్వారా చేప పిల్లలను ఉత్పత్తి చేసి ఇతర జిల్లాలకు పిల్లలను పెద్ద మొత్తంలో సప్లయ్ చేసేవారు. సీజన్ వచ్చిందంటే మత్స్యకారులతోపాటు వాహనాలతో ఈ ప్రాంతం కిక్కిరిసిపోయేది. కాలక్రమేనా ప్రాజెక్ట్ కాల్వల నిర్వహణ సరిగా లేక నీరు తగ్గిపోవడంతో వసతులు లేక చేప పిల్లల ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా ఉత్పత్తి కేంద్రం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం కరీంనగర్ మానేరు జలాశయం ప్రాంతంలో ఉత్పత్తి చేసి ఇక్కడ సీడ్ రేరింగ్ చేసి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు.



తాళం వేసి ఉన్న శనిగరం గ్రామంలోని చేపల ఉత్పత్తి కేంద్రం



నిరుపయోగంగా సిమెంట్ నర్సరీలు

శిథిలావస్థలో భవనం..

చేపల ఉత్పత్తికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న శనిగరం ఉత్పత్తి కేంద్రంలో ఉన్నతాధికారులు నిధులు విడుదల చేసి వసతులు కల్పించకపోవడంతో కేంద్రం వృథాగా మారింది. గతేడాది, ఇప్పుడు తూతూ మంత్రంగా నిధులు వెచ్చించి పాలిథిన్ కవర్లు, నర్సరీలు మరమ్మతులు చేసి 4 లక్షల చేప పిల్లలు పెంచేందుకు సిద్ధం అయ్యారు. అలాగే కేంద్రంలో ఉన్న బోరు మరమ్మతులో ఉంది. కేంద్రం నిర్వహణ లేకపోవడంలో చూసేందుకు కళాహీనంగా మారింది. కేంద్రంలో కుండీలు, భవనం శిథిలమయ్యే పరిస్థితి ఉంది. వెంటనే అధికారులు, పాలకులు ఉత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం తీసుకురావాలని మత్స్యకార్మికులు కోరుతున్నారు.

నలభై లక్షలకు.. నాలుగు లక్షలే

చేపల ఉత్పత్తి కేంద్రం శనిగరం శివారులో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయగా 8 సిమెంట్ నర్సరీలు, 16 మట్టి కుంట(కచ్చా పాండ్)లను ఏర్పాటు చేశారు. గతంలో లక్ష్యానికి మించి 35 లక్షల నుంచి 40 లక్షల వరకు చేప పిల్లలను ఉత్పత్తి చేసి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలకు చేప పిల్లలను పంపిణీ చేసేవారు. కాలక్రమేనా పాలకులు, అధికారులు నిర్లక్ష్యంతో చేప పిల్లల ఉత్పత్తికి నోచుకోవడం లేదు. కేవలం ఇతర ప్రాంతం నుంచి చేప పిల్లలు తీసుకొచ్చి 4 లక్షల చేప పిల్లలను సీడ్ రేరింగ్ మాత్రమే చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1,634 చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు ఉన్నాయి. గతంలో కేంద్రంలో మత్స్య సహాయక అధికారి, ఎఐఎఫ్ అధికారితోపాటు సిబ్బంది ఉండేవారు. కేంద్రం నిర్వహణ లేకపోవడంతో ఇక్కడి అధికారులు జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

కేంద్రం పురాతనమైనది

జిల్లాలో టెండర్ల ద్వారా చేప పిల్లలు పంపిణీ చేస్తున్నాం. శనిగరం గ్రామంలో ఉన్న చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం పురాతనమైనది. అక్కడ కొన్ని రకాల చేప పిల్లలు మాత్రమే ఉత్పత్తి చేసేందుకు వీలు ఉంటుంది. ప్రస్తుతం కుండీలలో నీరు నిలవడం లేదు. అక్కడ కేవలం సీడ్ రెరింగ్ మాత్రమే చేస్తున్నాం. శనిగరం కేంద్రంలో 4 లక్షల చేపలు పెంచేందుకు టార్గెట్ ఉంది.

– ఎ.మల్లేశం,
జిల్లా మత్స్యశాఖ అధికారి, సిద్దిపేట

మృత్యువులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి
- డీసీఎంను ఢీకొట్టిన బైక్
- కంది మండలంలో ఘటన
- మృతులు అక్షయ ఫౌండేషన్‌లో కార్మికులు



ఘటనా స్థలంలో యువకుల మృతదేహాలు



నవీన్



సందీప్



అభిషేక్

అంతా యుక్త వయసు యువకులే.. పైగా చిన్ననాటి దోస్తులు.. అంతా ఓ సంస్థలోనే చిరుద్యోగాలు చేస్తూ కుటుంబాలకి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. పక్క గ్రామాల వాళ్లే కావడంతో రోజూ ముగ్గురు కలిసి రోజుకొకరి బైక్‌పై ఉద్యోగానికి వెళ్లేవారు. సాఫీగా సాగుతున్న వీరి జీవితాల్లో రోడ్డు ప్రమాదం మృత్యురూపంలో కబలించింది.

సంగారెడ్డి /కంది: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కంది మండలంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వినయ్ కుమార్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం గొంగులూరు, గంగోజిపేట గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు కాశపాగ సందీప్ (22), కాశపాగ నవీన్ కుమార్ (19), గొంగులూరు గ్రామానికి చెందిన అభిషేక్ (22) కంది మండల కేంద్రంలోని అక్షయ పాత్రలో కార్మికులుగా పని చేస్తున్నారు. రోజుమాదిరిగానే గురువారం ఉదయం దాదాపు 30 కిలో మీటర్ల దూరం ఉన్న పనికి ముగ్గురూ ఒకే బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో కంది మండలం తుంకిళ్ల తండా వద్ద 161 జాతీయ రహదారిపై ఆగిన ఉన్న డీసీఎంను అతివేగంగా వెళ్లి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న సంగారెడ్డి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ప్రమాదం జరిగేటప్పుడు హెల్మెట్ పెట్టుకోలేదని, ముగ్గురికి పెళ్లి కాలేదని పేర్కొన్నారు.

మృతుల గ్రామాల్లో విషాదఛాయలు

పుల్‌కల్(అందోల్): చిన్ననాటి దోస్తు బంధం మృత్యువులోనూ వీడదీయలేదు. ముగ్గురు యువకుల మృతి వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిల్చింది. మృతుల్లో ఒకరైన సంటిపిల్ల అభిషేక్ మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామం కాగా వీరి తల్లిదండ్రులు వ్యవసాయకూలీలు, కాశపాగ నవీన్, కాశపాగ సందీప్‌లది మండల పరిధిలోని గంగోజిపేట గ్రామం. వీరు ముగ్గురు కూడా వారి కుటుంబాల్లో చిన్నవారే. చదువులు పూర్తయిన తర్వాత అక్షయపాత్ర సంస్థలో చిరుద్యోగులుగా చేరారు. ముగ్గురూ చిన్ననాటి స్నేహితులు. పక్క గ్రామాలు కావడంతో రోజుకొకరి బైక్‌పై విధులకు హాజరయ్యేవారు. యథావిధిగా గురువారం విధులకు వెళ్తుండగా రోడ్డుపై ఆగి ఉన్న డీసీఎంను ఢీకొని ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద వార్త తెలుసుకున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆర్.రాంచంద్రారెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యుడు ఇమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అన్ని విధాల ఆదుకుంటాం

అక్షయపాత్ర ఫౌండేషన్ తమ వద్ద పని చేస్తూ అనుకోకుండా మృతి చెందిన ముగ్గురు యువకులను ఆదుకుంటామని ఫౌండేషన్ యాజమాన్యం పేర్కొంది. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.20 వేలు అందజేశారు. మృతుల కుటుంబాలకు మంత్రి దామోదర రాజనర్సింహ సంతాపం తెలిపారు. ప్రభుత్వపరంగా వారి కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ట్రాక్టర్ కిందపడి రైతు మృతి



సత్యం (ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): ట్రాక్టర్ కింద పడి రైతు మృతి ఘటన మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమురెల్లి సత్యం (32) అనే రైతు తనకున్న రెండు ఎకరాల పొలం దున్నడానికి గురువారం ట్రాక్టర్ తీసుకొని వెళ్లాడు. ట్రాక్టర్‌కు కేజీవీల్ ఎక్కించుకొని బురదపొలం దున్నుతున్న క్రమంలో పైపు అడ్డు రావడంతో పొలంలోని పైపుతీసి తిరిగి ట్రాక్టర్ ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడ్డాడు. కాలు నుజ్జునుజ్జు కావడంతో పాటు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే పక్క పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

తట్టుకోలేక ప్రియురాలు ఆత్మహత్య

రైతు సత్యం మృతి తట్టుకోలేక గ్రామానికి చెందిన ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిక్కుడు జ్యోతి(22) హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో పని చేస్తుంది. తొలి ఏకాదశి పండుగకు స్వగ్రామమైన లింగారెడ్డిపల్లికి వచ్చింది. గ్రామానికి చెందిన సత్యంతో గతేడాది పైగా నుంచి వివాహేతర సంబంధం కొనసాగుతుంది. గురువారం సత్యం మృతి తట్టుకోలేక ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పుడు పత్రాలు సృష్టించి భూమి కాజేయాలని చూసి

బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌తోపాటు మరో ఐదుగురిపై కేసు

సిద్దిపేటకమాన్‌: తప్పుడు పత్రాలు సృష్టించి భూమి కాజేయాలని చూసిన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన విశ్వంత్ నందీశ్వరి, దొమ్మాట మధుసూదన్‌రెడ్డి కలిసి గతంలో 744 చదరపు గజాల పాత భవనాన్ని కొనుగోలు చేశారు. తర్వాత పాత భవనాన్ని కూల్చివేసి నూతన భవనాన్ని నిర్మించుకోవడానికి మున్సిపల్ నుంచి అనుమతులు కూడా తీసుకున్నారు. అదే స్థలంలో చిన్న కారు షెడ్డును అలాగే ఉంచారు. ఈ క్రమంలోనే పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్‌తోపాటు బీఆర్‌ఎస్ నాయకులు మిద్దె రవీందర్, మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్, మరుపల్లి యాదగిరి, మర్కంటి శ్వేత కలిసి కారు షెడ్డు ఉన్న 325 గజాల స్థలాన్ని కాజేయాలని చూశారు. ఈ స్థలంపై బాదరవేణి యాదవ్వ పేరిట ఇంటి నంబర్ తీసుకొని అనంతరం నకిలీ పత్రాలు సృష్టించి ఆరుగురి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆరుగురి వ్యక్తుల్లో ఐదుగురు కలిసి మర్కంటి శ్వేత పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న స్థల యజమాని నందీశ్వరి బుధవారం ఆరుగురిపై సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం



జనార్దన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి ఉన్నత పాఠశాలలో గురువారం సంస్కృతిక దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం-2020 నాల్గో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22 నుంచి 29 వరకు దేశవ్యాప్తంగా శిక్ష సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలతో భక్తిగీతాలు, దేశభక్తిగేయాలు, జానపద గేయాలు, నృత్యాలు, ఏక పాత్రాభినయనం, నాటకం, పద్యపానం చేయించినట్లు తెలిపారు. అనంతరం వెయ్యికి పైగా శతక పద్యాల కంఠస్థ పాఠకుడు, వేణుగాన కళాకారుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాషికంటి జనార్దన్ పాఠశాలలో తన కలలను ప్రదర్శించారు. ఆయన్ను పాఠశాల హెచ్‌ఎం ఐలయ్య, సిబ్బంది కృష్ణమూర్తి, లక్ష్మణ్, పద్మ, విజయ్‌కుమార్, ప్రకాశ్‌రెడ్డి, యాదగిరి, స్వామి, స్వర్ణకుమార్, రాజేశ్వరి, కనకలింగం, శ్రీధర్, ఫాతిమా సుల్తానా, ఉమర్ శాలువాతో సన్మానం చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు..

రామచంద్రాపురం (పటాన్ చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జటిన్ బోర(55) జీవనోపాధి కోసం పది రోజుల కిందట హైదరాబాద్ నగరానికి రాగా, బుధవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉద్యోగం చూసుకోవడానికి వచ్చాడు. తెల్లాపూర్ మై హోమ్ సయుక్ వద్ద రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓ మోటార్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ సమీపంలో చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ కథనం మేరకు.. ఆరూర్ గ్రామానికి చెందిన కాలాలి రాజు గౌడ్(47)సదాశివపేట పట్టణానికి వ్యక్తిగత పనులపై వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు సంగారెడ్డిలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..

పటాన్‌చెరు టౌన్‌: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడకు చెందిన సురేందర్ రెడ్డి 21వ తేదీన కుటుంబ సభ్యులతోపాటు స్నేహితుడు సందీప్‌రెడ్డి కుటుంబీకులతో పటాన్‌చెరు మండలం ముత్తంగికి రింగ్ రోడ్డు మీదుగా వెళ్తున్నారు. సుల్తాన్‌పూర్ ఎగ్జిట్-4 వద్ద ఓఆర్‌ఆర్ ఎక్కి కొద్ది దూరం వెళ్లగా సందీప్ రెడ్డి కుమారుడు మొక్షిత్ రెడ్డి(6) టాయిలెట్ వస్తుందని చెప్పడంతో కారును ఓఆర్‌ఆర్ పై పక్కకు నిలిపారు. బాలుడు కారు దిగి ఉండగా గుర్తుతెలియని వాహనం టైర్ ఎగిరి వచ్చి తగలడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకవెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు.

శిథిలావస్థ ఇళ్లు కూల్చివేత



ఇళ్లను కూల్చి వేయిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్‌: వర్షాకాలం దృష్ట్యా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ప్రజలు ఎవరూ ఉండకూడదని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. సీడీఎంఏ ఆదేశాల ప్రకారం గురువారం పట్టణంలోని 1వ వార్డులో శిథిలావస్థలో ఉన్న నాలుగు ఇళ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నూతన మున్సిపల్ భవనం వెనుకాల ఉన్న టీటీసీ బిల్డింగ్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొంకట నళినిదేవి, వార్డు ఆఫీసర్ ఎల్లయ్య, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సీటు దొరక్క.. టీసీ తప్పక

- వసతి గృహాల కోసం విద్యార్థుల ఇబ్బందులు
- సీట్లు లేక టీసీలు తీసుకుంటున్న వైనం
- ఉన్నవాటి కంటే రెండింతల దరఖాస్తులు
- ఎస్టీ మినహా నిండిపోయిన ఆరు హాస్టళ్లు



పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్

సిద్దిపేటఎడ్యుకేషన్‌: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు తీసుకునే విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు దొరక్కపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు హాస్టల్‌లో సీటు లేకపోవడంతో టీసీ తీసుకొని వెళ్లిపోగా మరి కొందరు టీసీలు తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

సిద్దిపేట విద్యా హబ్‌గా పేరుగాంచడంతో సుదూర ప్రాంతాల నుంచి పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్, డిగ్రీ, అటానమస్, మహిళా డిగ్రీ కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులు ప్రవేశాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలలు ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా ఇప్పటికి చాలా మంది విద్యార్థులకు హాస్టళ్లలో సీట్లు దొరక్కపోవడంతో వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లలకు హాస్టళ్ల వసతి కల్పించాలని వేడుకుంటున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేకంగా బాలురు, బాలికల హాస్టళ్లను ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇటు అధ్యాపకులు సూచిస్తున్నారు.

ఏడు హాస్టళ్లు ఉన్నా..

ప్రతీ సంవత్సరం మెదక్, నారాయణఖేడ్, రామాయంపేట, కామరెడ్డి, హుస్నాబాద్ తదితర ప్రాంతాల నుంచి ఈ కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు తీసుకుంటున్నారు. పట్టణంలో బాలురకు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, బాలికలకు మూడు బీసీ, ఒక ఎస్సీ హాస్టల్ మాత్రమే ఉన్నాయి. బీసీ హాస్టల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో నేరుగా దరఖాస్తులు తీసుకున్నారు. బీసీ, ఎస్టీ హాస్టళ్లలో పలువురు జూనియర్ విద్యార్థులకు సీట్లు కేటాయించారు.

సీట్ల వివరాలు

బీసీ బాలురకు తోర్నాల 100, కోటిలింగాలు 100, సిద్దిపేటలో ఎస్టీ బాలురకు 100, ఎస్సీ బాలురకు 100, బీసీ బాలికలకు కోటిలింగాలు 120, మైత్రీవనం 120, నాసర్‌పుర 132, ఎస్సీ బాలికలకు సిద్దిపేట 100, మైత్రీవనంలో 100 సీట్లు ఉన్నాయి. వీటిల్లో డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్, ఐటీఐ తదితర కోర్సులు చదివే పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు సీట్లు ఇవ్వాల్సి ఉంటుంది. డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో సుమారు 4,500 మంది, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 471 మంది, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సుమారు 500 మంది, బాలికల కళాశాలలో 235 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో కనీసం 30 శాతం మంది విద్యార్థులు హాస్టళ్లలో ఉండి చదువుకునే వారే వీరందరికీ హాస్టల్ సౌకర్యం కల్పించాల్సి ఉంటుంది. అయితే ఎస్టీ బాలుర మినహాయించి అన్ని హాస్టళ్లలో ఉన్న సీట్లకు రెండింతల దరఖాస్తులు వచ్చాయి. దీంతో సగం మంది విద్యార్థులకు హాస్టల్ సీటు దొరికే పరిస్థితి కనిపించడం లేదు.

శాశ్వత భవనాలు నిర్మించాలి

సిద్దిపేటలో ఎస్సీ, ఎస్టీతోపాటు ఒక బీసీ బాలికల హాస్టల్‌కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగతావి అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. దీంతో ఎక్కువ మంది విద్యార్థులను హాస్టల్‌లో చేర్చుకునే అవకాశం లేకుండా పోతుందని పలువురు వార్డెన్‌లు వాపోతున్నారు. చిన్నకోడూరు, చేర్యాల, దుద్దెడ, సిద్దిపేటకు నూతనంగా మంజూరైనా ఎస్సీ హాస్టల్‌ను ప్రారంభించి అన్ని హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మిస్తే సమస్య కొంత మేరకు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

డబ్బులివ్వండి..

ప్రజాపాలన దరఖాస్తుల ఆపరేటర్ల మొర

జహీరాబాద్ టౌన్‌: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఫీడ్ చేసినా మాకు డబ్బులు ఇవ్వడంలేదని డేటా ఆపరేటర్లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించింది. అర్హులైన వారికి సాయం చేసేందుకు వెంటనే దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించింది. ప్రభుత్వ డీటీపీ ఆపరేటర్లు సరిపోకపోతే ప్రైవేట్ వాళ్లను నియమించింది. ఒక్కో దరఖాస్తుకు 15 రూపాయలు ఇస్తామన్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో డీటీపీ ఆపరేటర్లు లేకపోవడంతో సుమారు 25 మంది ప్రైవేట్ ఆపరేటర్లతో దరఖాస్తుల ఆన్‌లైన్ చేయించారు. శరవేగంతో ఆన్‌లైన్ పనులు పూర్తి చేయాలని అధికారులు గడువు నిర్దేశించారు. రాత్రి పగలు కష్టపడి దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామని, కానీ ఇంత వరకు తమకు పారితోషకం ఇవ్వడం లేదని ఆపరేటర్లు వాపోతున్నారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా బడ్జెట్ రాలేదని తిప్పించుకుంటున్నారని ఆపరేటర్ శివప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ఆపరేటర్‌కు సుమారు రూ.30 వేల వరకు డబ్బులు రావల్సి ఉందన్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు రావల్సిన డబ్బులు ఇప్పించాలని కోరుతున్నారు.